# లీటరున్నర నీళ్లతో స్నానం

## నిజమా?

Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org




అవును. మీరు విన్నది నిజమే. ధర్మపురికి చెందిన కుళియల్ గోవిందస్వామి లీటరున్నర నీళ్లతోనే స్నానాన్ని ముగిస్తాడు. అదీ రెండుసార్లు షాంపూ, రెండుసార్లు సబ్బుతో మరీ చేసి చూపిస్తాడు. ఇది అతని అభిరుచి కాదు... ఆలోచన. భూగర్భజలాలు తగ్గుతున్నాయి... భవిష్యత్తులో మంచినీటి కరవు ప్రమాదం ఉందంటూ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో నీటిని వృధా చేయకుండా, కాపాడుకునే బాధ్యత మనకు ఉందంటూ  అందరి ఎదుటా స్నానం చేసి మరీ... అవగాహన కల్పిస్తున్నాడు .

తమిళనాడులోని ధర్మపురి సమీపంలోని ఓ కుగ్రామం ఇతనిది.  పాఠశాలకు పంపే స్తోమత తల్లిదండ్రులకు లేకపోవడంతో , చదువుకోవాలని ఉన్నా కూడా, వేరే దారి లేక చిన్నప్పటి నుంచే మేకలను మేపుతూ, కుటుంబానికి చేయూతగా ఉండేవాడు. ధర్మపురి జిల్లా గ్రామాలన్నింటిలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉండేది. ఉదయమే మేకలను తోలుకొని గ్రామ శివారుల్లోకి వెళ్లే గోవిందస్వామి తనతోపాటు రెండు లీటర్ల నీటిని తీసుకెళ్లేవాడు. ఆ నీటినే రోజంతా వినియోగించుకోవాల్సిన పరిస్థితి ఉండేది. అలా చిన్నవయసు నుంచే నీటిని పొదుపుగా వాడేవాడు.

ఎక్కడ చూసినా నీటి వృధా జరుగుతున్నట్లు గోవిందస్వామి గుర్తించాడు. దీంతో తనవంతు అవగాహన కల్పించాలనుకున్నాడు. చిన్నప్పటి నుంచి అతితక్కువ నీటితోనే స్నానం చేయడం అలవాటున్న ఇతడు దాని ద్వారానే నీటి విలువను అందరికీ తెలియ చెప్పాలనుకున్నాడు. దానిని స్థానిక పాఠశాల నుంచి మొదలుపెట్టాడు. విద్యార్థుల ఎదుట లీటరున్నర నీటితో స్నానం చేసి చూపించి, నీటిని వృధా చేయవద్దంటూ అవగాహన కల్పించాడు. అలా ధర్మపురి జిల్లా పాఠశాలలు, పలు వేదికలపై గోవిందస్వామి అవగాహన కల్పిస్తుండగా, ఆ విషయం అక్కడి కలెక్టరు దృష్టికి వెళ్లింది. దాంతో ఇతర ప్రాంతాలు అలాగే ప్రత్యేక కార్యక్రమాల్లో గోవిందస్వామితో అవగాహనాకార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం మొదలుపెట్టారాయన. దీంతో రాష్ట్రవ్యాప్తంగా గోవిందస్వామి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాడు.

**-సి.హెచ్.వసుంధరాదేవి**

Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org